

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# వినాయకుడి బొమ్మలు

లక్ష్మి బొమ్మలు చేస్తోంది. వినాయకుడి బొమ్మలు...

"ఇగ ఈపాలి ఎట్లయిన నాలుగయిదొందల బొమ్మలు చేయాల... మస్తు పైసలు పోగుజేయాల.. ఇగ గిప్పుడు గాకుంటే మళ్ల గిన్ని పైసలు దొర్కవు..." స్వగతంలో అనుకుంటోంది లక్ష్మి.

కానీ రాత్రింబగళ్లు చేసినా అన్ని బొమ్మలు తయారయ్యేటట్లు లేవు. 'ఇంక వీటికి రంగులెయ్యాల' అనుకుంది తయారు చేసిన చిన్నా పెద్దా వినాయకుడి బొమ్మలన్నీ గుడిసెలో ఒక మూల పేర్చి చూసుకుంటూ.

అవతల పక్క చాపమీద పడుకున్న యాదమ్మకు దగ్గు తెర వచ్చింది. ఖంగు ఖంగుమని ఊపిరాడకుండా దగ్గుతోంది. లక్ష్మి కుండలోని నీళ్ళు తెచ్చి ఇచ్చింది. యాదమ్మ గొంతు తడుపుకుంది.

"రోగం ఏమున్నదో దెల్వదు గానీ, పేణం పొగతలేదు, ఉంటలేదు. దవ్వకానలో బోతే ఇక ఎక్స్‌రే అంటడు, నెత్తురు పరీక్ష అంటడు, పైసలు గుంజుతరుగానీ రోగమైతే తక్కువ కాదు... ఈ రోగంతోని పొయ్యేదానికి నేతయ్యారున్నగానీ... నీలగ్గం గిట్ట అయితే, నాకు బేఫికరుంటది..." అని యాదమ్మ గొణుక్కుంటూనే ఉంది.

"మొదలు నీ రోగం సంగతి జూడనీ... లగ్గం ముచ్చట ఇప్పుడేంటికి?" అన్నది లక్ష్మి.

"గింత ముసలితనంల రోగాలు గాక ఇంకేమొస్తయి... నీకు లగ్గం అయితే ఇగనేను ఉన్నగానీ, పోయినగానీ, ఫికరులేకుండ ఉంటది. అండ్లకోసమే జెప్తున్న. ఎవలనన్న పోరని నువ్వే జూస్కుకో... నేనయితే దిరగలేనుగందా.." అన్నది యాదమ్మ కూతురితో...

"ఇగ ఈ ముచ్చట ఆపరాదె...." అన్నది లక్ష్మి కంచంలో అన్నం పెడుతూ.

యాదమ్మ కష్టజీవి. మోండా మార్కెట్‌కెళ్లి కూరలు తెచ్చి నెత్తిన తట్టపెట్టుకుని ఇల్లిల్లూ తిరుగుతూ, అయిదు పదీ సంపాదించుకుంటూ రోజులు వెళ్లబుచ్చింది. ఇప్పుడింక ఓపిక తగ్గిపోయింది. అంత శ్రమపడలేకపోతోంది. రోజు గడిచేదెట్లా – అన్న ప్రశ్న ఎదురవుతోంది.

లక్ష్మి పెళ్లికి ఎదిగింది. నిన్నమొన్నటిదాకా కన్నుల పండువగా కనిపించిన కూతురు ఇప్పుడు గుండెలమీద కుంపటి అయిది. తను కన్నుమూస్తే కూతురుగతేమిటి – అన్నదే యాదమ్మను కుంగదీస్తున్న సమస్య.

లక్ష్మి తల్లికి కంచంలో అన్నం పెట్టింది. ఆమె తిన్న తరువాత కంచం కడిగి ఒక మూల పెట్టింది.

"నువ్వు కూడ తినరాదె..." అన్నది యాదమ్మ.

"గిప్పుడెవస్తా..." అంటూ లక్ష్మి బయటకు నడిచింది.

దగ్గర్లోనే వినాయకుడి గుడి ఉంది. లక్ష్మికి పూజలు పునస్కారాలు తెలియవు. రోజూ ఒక సారి గుడికెళ్ళి దేవుడికి నమస్కారం చేసుకుని వచ్చి ఆ తర్వాతనే అన్నం తింటుంది.

లక్ష్మి వెళ్లే వేళకు గుడిలో పూజారి తప్ప ఇంకెవరూ ఉండరు. క్రమం తప్పకుండా రోజూవచ్చే భక్తురాలు కనుక పూజారికి లక్ష్మిపట్ల ప్రత్యేకమైన అభిమానం. తీరికగా కూర్చుని ఆయనతో తన సమస్యలు చెప్పుకొంటుంది. ఆయన సలహాలు చెబుతాడు. దేవుడే ఆయన ద్వారా తనతో మాట్లాడుతుంటాడని కూడా లక్ష్మికి అనిపిస్తూ ఉంటుంది.

లక్ష్మికి ప్రసాదం ఇచ్చాక పూజారి గర్భగుడిలో నుంచి బయటకు వచ్చాడు.

"ఏం లక్ష్మీ ఇప్పటికి ఎన్ని ప్రతిమలు చేశావు?" అని అడిగాడు పూజారి స్తంభానికి అనుకుని కూర్చుంటూ.

"ఇగ ఈపాలి అయిదొందల బొమ్మలు చేయాలనుకున్న అయ్యగారూ.. కానీ రెండొందల బొమ్మలు కూడా కాలే. పండగయితే దగ్గర పడినది. ఈపాలి అయినా మస్తు పైసలు జమచేసి మా అమ్మను డాక్టరికి చూపియ్యాలనుకున్నా.. కానీ గయ్యేటట్లు లేదు. మాయమ్మ రోగం తగ్గేటట్లు లేదు.... డాక్టరు అయితే శానా పైసలు అడుగుతుండు..." అన్నది లక్ష్మి ఆయనకు ఎదురుగా కూర్చుంటూ.

"అందుకే అన్నారు. యమధర్మరాజు ప్రాణాలను మాత్రమే తీసుకుంటాడు. కానీ వైద్యుడు డబ్బునూ ప్రాణాలనూ కూడా తీసుకొంటాడు అని... నువ్వు దేవుడ్ని నమ్ముకుని రోజూ ఆయనతో నీ కష్టాలుచెప్పుకుంటున్నావు. అన్నీ ఆయనే చక్కదిద్దుతాడు, దిగులుపడకు" అన్నాడు పూజారి.

"దేవుడు నాకైతే కనిపియ్యడు గద అయ్యగారూ..."

"నీకు ఆయన కనిపించకపోతేనేం.. ఆయనకు నువు కనిపిస్తావు చాలదూ..."

"ఏమో అయ్యగారూ... నాకెందుకో గుబులు అయితది. మాయమ్మ తప్ప నాకింకెవలూ లేరు. అమ్మ కూడా లేకుండాపోతే..." లక్ష్మికి దు:ఖం పొంగుకొచ్చి మాట బయటకు రావడం లేదు.

"రోజూ వచ్చి వినాయకుడికి నమస్కారం చేసి వెళ్తున్నావు. ఆయనకు నువు తెల్సు. నీకు తెల్సిన భగవంతుడే కొండంత అండగా ఉన్నప్పుడు, తెలియని భవిష్యత్తు గురించి బెంగ ఎందుకు? అన్నీ ఆయనే చూసుకుంటాడు.." అంటూ పూజారి ధైర్యం చెప్పాడు.

''ఏమో అయ్యగారు... నాకు లగ్గం చేయలేకపోతున్నందుకు అమ్మ ఫికరయిపోతున్నది''

''చక్కగా ముస్తాబు చేసి మంచి చీర కడితే కడిగిన ముత్యంలా ముచ్చటగా ఉంటావు. నీలాంటి దాన్ని పెళ్ళి చేసుకోవాలంటే, వాడు ఎన్నో జన్మల పుణ్యం చేసుకుని ఉండాలి, దిగులుపడకు. ఆ విఘ్నేశ్వరుడే నీకు తగిన వరుడ్ని పంపిస్తాడు' అని దీవించాడు పూజారి.

''దేవుడు మనకు అందనంత దూరం వెళ్లిపోతున్నాడయ్యగారూ...''

''లేదు, దేవుడు ఎప్పుడూ పిలిస్తే పలికేంత దూరంలోనే ఉంటాడు. కానీ మనమే ఆయన్ను దూరం చేసుకుంటూ ఉంటాం...'' అన్నాడు పూజారి.

రోజూ ఆయనతో కాసేపు మాట్లాడితే లక్ష్మికి ఎంతో ఊరడింపు లభిస్తుంది. అందుకే తప్పకుండా గుడికి వెళ్తుంది.

మధ్యాహ్నం బజారుకెళ్లి పెయింట్ తెచ్చుకుంది. బొమ్మలకు రంగులు వేయటం మొదలెట్టింది. రాత్రిదాకా అదే పనిలో నిమగ్నమైంది.

బయట వాన పడుతోంది. జల్లు లోపలికొస్తోంది. తడిక అడ్డం పెట్టినా సందుల్లో నుంచి వచ్చే నీటితో సగం నేల తడిసిపోయింది. మిగతా సగం చెమ్మగిల్లింది. యాదమ్మ చాపమీద పడుకుని చలికి వొణుకుతోంది. దీపం ఆరిపోయింది.

బొమ్మలు తడిసిపోతున్నాయి. లక్ష్మికి రెండు చీరలే ఉన్నాయి. ఒంటిమీద ఒకటి ఉంటే, తడికమీద మరొకటి ఉంటుంది. రెండో చీర దేవుడి బొమ్మల మీద కప్పింది. ఆ చీకట్లోనే. కానీ వెంటనే మనసులో సంకోచం మొదలైంది.

'అయి దేవుడి బొమ్మలే. వాటి మీద తను కట్టుకునే చీర కప్పింది. తప్పు గందా...' అనుకుంది. చెంపలేసుకుంది మనసులోనే.

ఎంత సర్ది చెప్పుకున్నా దేవుడి బొమ్మల మీద తన చీరకప్పి తప్పు చేశానన్న అభిప్రాయం పోవటం లేదు.

మర్నాడు బొమ్మలకు రంగులేస్తోంది. నలుగురు మనుషులొచ్చారు. లక్ష్మి వాళ్లనెప్పుడూ చూడలేదు.

''ఈ బొమ్మలు ఎవలు చేస్తున్రు...'' అని అడిగాడొకడు. గుడిసెలోకి తొంగి చూస్తూ. మిగతా ముగ్గురు బయట నిలబడ్డారు.

''నేనే జేస్తున్న.. గేంటికి...

''ఇగ ఎన్ని బొమ్మలు జేసినవ్?''

''నీకేంటి?''

''మొత్తం అమ్మితే వచ్చే పైసల్లో నాలుగో వంతు మాకియ్యపడతది...''

''మీకేంటి ఇయ్యాల?...'' అన్నది లక్ష్మి అడ్డంగా నిలబడి కొంగు బిగించి.

''మేం ఈ బస్తీల లీడర్ ఉన్నం. ఎవలు బిజినెస్ జేసిన మాకు మాములు ఇయ్యాల... లేకుంటే మా బస్తీలో ఉండజాలరు..''

''నేనియ్య గింత కష్టంతోని బొమ్మలు చేస్తున్న వానపడుతుంది. అమ్ముడవుతయో లేదో తెల్వదు. నాకే నుక్సాన్ అవుతుంది. మల్లీ మీకు యాడికెల్లిదెచ్చియ్యాల...'' అన్నది లక్ష్మి.

''ముచ్చట జెప్పకు, పైసలు ఇస్తవా లేదా గింతనే జెప్పు''

''నేనియ్య''

''మాకు పైసలు ఇయ్యకుండ, బస్తీలో తిరుగుతవా..''

''ఏంటిగ దిరగ? ఈ బస్తీ నీ జాగీరున్నదా?''

''ఎక్కువ తక్కువ మాట్లాడుతున్న దిమ్మఖరాబున్నదా? గియ్యకుంటె జూడు ఏమయితదో?'' అని బెదిరించి వెళ్లాడు.

చుట్టుపక్కల గుడిసెల వాళ్లంతా చోద్యం చూస్తూ నిలబడ్డారు.

''వాళ్లు గుండాలున్నరు. వాళ్లతోని ఏంటికి పెట్టుకున్నవే'' అన్నారు పక్క గుడిసెల్లోని వాళ్ళు.

''నేనే పైసలు లేక చస్తున్న మాయమ్మకు బీమారుంటే దవాకానలో చేర్చకుండ గమ్మున ఉన్న. ఈళ్లకు యాడికెల్లి దెచ్చియాల పైసలు?..'' అన్నది లక్ష్మి.

గుడిలోకి వచ్చింది. ఆ గూండాల నుంచి కాపాడమని దేవుడికి చెప్పుకొంది, పూజారికీ చెప్పుకుంది.

"ఎంతో పుణ్యం చేసుకుంటేగానీ మానవ జన్మ లభించదంటారు. కొందరు మనుష్య జన్మ ఎత్తి మానవుల్లాకాక దానవుల్లా ప్రవర్తిస్తుంటారు.." అన్నాడు పూజారి.

"రాతిరి వానొచ్చినప్పుడు దేవుడి బొమ్మల మీద నా చీర గప్పిన. ఇగ దేవుడు గుస్స అయితుండు. ఆండ్ల కోసమే తెల్లారి ఈ గుండాలను పంపిండు" అని మనసులో సంకోచం బయట పెట్టింది.

"అది తప్పు ఎలా అవుతుంది? ఆయన వానలో తడవకుండా నీకు చేతనైన ప్రయత్నం చేశావు. దేవుడి మీద భక్తితో ప్రేమతో ఏం చేసినా ఆయన చిరునవ్వుతో స్వీకరిస్తాడు. శబరి పళ్లు ఎంగిలి చేసి పెడితే తినలేదా?" అని పూజారి లక్ష్మికి నచ్చచెప్పాడు.

"ఆ గూండాలు ఏమైన చేస్తరేమో నయ్యాగారూ... బయమయితున్నది..." అన్నది లక్ష్మి.

"మానవ జన్మ ఎత్తినప్పుడు భగవంతుడూ కొన్ని కష్టాలు పడ్డాడు. సుఖాలతోపాటు కష్టాలూ తప్పవు. అంతమాత్రాన నిరాశ చెందవద్దు. ఇంత అందమైన గులాబీ పూల కింద ఈ ముళ్లు ఎందుకు పెట్టాడు దేవుడు – అని కొందరు ప్రశ్నిస్తారు. ఇలాంటి ముళ్ల కొమ్మల చేత కూడా ఇంత అందమైన గులాబీపూలు పూయిస్తున్నారు. కదా– అని మరికొందరు ఆశ్చర్యపోతారు. కనుక కష్టాలు సుఖాలు కూడా జీవితంలోని భాగాలే. కష్టాల నుంచి గట్టెక్కే బాధ్యత దేవుడే స్వీకరిస్తాడు. ఆయన్ను నమ్ముకో, నీ నెత్తిన బరువు పెట్టాడని బాధపడకు. బరువు భారంతో నువు కుంగిపోకుండా నీపాదాల కింద ఆయన చేతిని అడ్డుపెడతాడు. అంటే నిన్నూ, నీ తలపైనున్న భారాన్నీ ఆయనే తన చేతిలోకి తీసుకుంటున్నాడన్నమాట. ఇంక మరి బతుకు భారం గురించి నీకు దిగులెందుకు? " అని లక్ష్మికి వివరంగా చెప్పాడు పూజారి. సాక్షాత్తూ భగవంతుడే ఆయన ద్వారా తనకా విషయాలన్నీ చెబుతున్నట్లు లక్ష్మి అనుకుంది.

పండగ దగ్గరకొచ్చేసింది. బొమ్మలను రంగులతో అలంకరించటం పూర్తి అవుతోంది. ఇంకా కొన్ని బొమ్మలు మిగిలిపోయాయి. పగటిపూట బొమ్మలను అమ్మకానికి బండిమీద పెట్టుకొని వీధిలోకి తీసుకెళ్లి రాత్రి ఇంటికొచ్చి అన్నం వండుకు తిని కిరసనాయిలు దీపం వెలుగులో మిగిలిపోయిన బొమ్మలకు రంగులు వేస్తోంది.

వీధిలోకి వెళ్లాక బొమ్మల మీద కప్పేందుకు పెద్ద పాలిథిన్ కాగితం సంపాదించింది. వాన జల్లు వచ్చినప్పుడల్లా ఆ కాగితాన్ని బొమ్మల మీద కప్పుతోంది. తను వానలో తడుస్తోంది. తడి చీర గాలికి ఆరుతోంది. తడి తల నుంచి నీళ్ళు కారుతున్నాయి. తల తుడుచుకునేందుకు పొడి గుడ్డ లేదు. బొమ్మలు అమ్మి సంపాదించిన నోట్లు మాత్రం తడిసిపోకుండా పాలిథిన్ కాగితంలో భద్రంగా మడిచిపెట్టి ఎంత సంపాదించింది లెక్క చూసుకుంటోంది.

గుడికెళ్లి దేవుడికి దండం పెట్టుకునే బయల్దేరుతోంది.

"ఎలా ఉంది సంపాదన?" అన్నాడు పూజారి.

'గిప్పటిదాకా బొమ్మలు కొనేటిది లేదు, నిన్నటి నుంచి హోరుగాలే.. గిన్ని దినాల నుండి చేసిన కష్టమంతా.. ఒక్కదినంలో ఫలితమిస్తది. సవితి ముందు దినం నాడు సూడాల..." అన్నది లక్ష్మి.

"ఏదైనా అంతేనే... ఇన్నాళ్ళూ పడిన కష్టమంతా ఒక్కరోజులో ఫలితాన్ని ఇచ్చినట్లుగానే, ఏడాది పొడుగునా చదివిన చదువంతా పరీక్షనాడు పనికొచ్చినట్లుగానే ఇన్నేళ్లపాటూ నువు దేవుడికి మొక్కుకుని సంపాదించిన పుణ్యమంతా, ఆపదలో ఉన్న సమయంలో అక్కరకొస్తుంది. దేవుడే స్వయంగా వచ్చి నిన్ను ఆదుకొంటాడు..." అన్నాడు పూజారి.

లక్ష్మి వినాయకుడి విగ్రహాలు అమ్ముకునేందుకు వెళ్ళింది. రోజంతా ఎండలో నిలబడి అమ్మినా నాలుగోవంతు బొమ్మలు కూడా అమ్ముడు కాలేదు.

రాత్రి ఎనిమిది గంటలకు రద్దీ తగ్గిపోయింది. బొమ్మలున్న తోపుడు బండిని నెట్టుకుంటూ ఇంటికి బయల్దేరింది.

లైట్లు ఆరిపోయాయి. చీకటి.

నీడల్లాగా నలుగురు మనుషులు ఆమె దగ్గరకు వచ్చారు.

"మా మామూలు ఇయ్యకుండ బస్తీలో బిజినెస్ చేస్తావంటే..." అంటూ వాళ్ళు చుట్టుముట్టారు.

లక్ష్మి తిరుగుతోంది. అరుస్తోంది. ఆమె మొర వినిపించుకునే వాడెవడూ కనిపించలేదు. చేత్తో నోరు మూసారు. గిల గిలా గింజుకుంటున్న ఆమెను బలవంతంగా చీకట్లోకి లాక్కుపోయారు. రోడ్డుకు కొద్దిదూరంలో పాడుబడిన గోడల మధ్యకు తీసుకుపోయారు.

లక్ష్మిని కింద పడేశారు. ఆమె ఏడుస్తోంది. అరుస్తోంది, తిడుతోంది. ఒకడు లక్ష్మి చేతులు వదలకుండా లాగి పట్టుకున్నాడు. మరొకడు కాళ్లు కదలకుండా పట్టుకున్నాడు. ఇంకొకడు వొంటిమీద చీరను లాగేశాడు.

ఆమెకాసమయంఓ వానలో తడుస్తున్న బొమ్మల మీద తన చీర కప్పిననాటి దృశ్యమే కళ్లముదు కనిపిస్తోంది.

"దేవుడా... చీకట్లో నువు వానలో తడవకుండా ఉండేటందుకే నా చీర కప్పాను. ఇప్పుడు వీళ్ళు చీకట్లో నా చీర లాగేస్తున్రు... ఇగనా ఇజ్జత్ పోతది..." అంటూ మనసులోనే దేవుడ్ని తలుచుకుంది.

సరిగ్గా ఆ సమయంలో ఎక్కడి నుండి వచ్చాయో, ఎలుకలూ, పంది కొక్కులు అటూ ఇటూ తిరుగుతూ ఆ నలుగురు గూండాలను చుట్టుముట్టాయి. వాళ్ళు పచ్చి నెత్తురు తాగే కిరాతకులే కావచ్చు. కానీ ఆ సమయంలో వాళ్లు చేయదల్చుకున్న కిరాతకాన్ని ఆ ఎలుకలూ పందికొక్కులే అడ్డుకోగలిగాయి.

"గిదేందరబాయి, ఎల్కలు మీదకు ఉరుకుతున్నాయి.. ఇగ ఇప్పుడు గాదులే పదండ్రి..." అంటూ వాళ్ళు లక్ష్మిని వదిలేశారు.

లక్ష్మి చీర సర్దుకుంది. లేచి నిలబడింది. తడబడే అడుగులతో రోడ్డుమీద కొచ్చింది. తనబండి దగ్గర పొట్టిగా లావుగా, ఇంత బొజ్జతో, చిన్నకర్రతో ఉన్న మనిషి కనిపించాడు.

"గింత చీకట్లో యాడ్కిబోయినవు బిడ్డా... నీ ఇంటితాన దింపుత... పద..." అన్నాడు ఆ మరుగుజ్జు మనిషి.

ఆమెతో కల్సి కొంత దూరం వచ్చాడు. ఇంతలో ఎవరో కుర్రాడు కనిపించాడు.

"రేయ్ రాముడూ, ఈ పోరికి గాడదాక తోడుగా ఎళ్లరా..." అన్నాడు ఆ మరుగుజ్జు.

రాముడు తోడుగా నడిచాడు. ఇంటిదాకా దింపాడు. మర్నాడు కలుస్తానని చెప్పి వెళ్లాడు.

తెల్లారాక లక్ష్మి గుడికెళ్లింది. పూజారికి జరిగినదంతా చెప్పింది.

"నేను చెప్పాను కదా, చేసుకున్న పుణ్యం ఏదో ఒకరోజు అక్కరకొస్తుందని...నీకు మరుగుజ్జు రూపంలో కనిపించిందీ... ఎలుకల వాహనాన్ని ఆ దుండగుల మీదకి పంపదిందీ... రాముడ్ని నీకు తోడుగా పంపిందీ... ఎవరనుకున్నావు? అన్ని వందల ప్రతిమలు తయారుచేశావు. వాటి అన్నిటికీ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. పూజలు జరుగుతాయి. ధూప దీప నైవేద్యాలూ అందుతాయి. కనుక ఇన్ని వినాయక విగ్రహాలు సృష్టించిన నీ శ్రమ ఊరికే పోతుందా? నీకు పెళ్లి చేయటం మీ అమ్మకు చేతగాని పని... నీకు చేతనైన పని నువ్వు చేస్తే, నువు చేయలేని పని భగవంతుడు చేస్తాడు... " అన్నాడు పూజారి.

దేవుడే పూజారి ద్వారా ఆ మాటలు పలికించాడని లక్ష్మి నమ్మకం.

లక్ష్మి పూజారికి పాదాభివందనం చేసింది. ఆయన 'శీఘ్రమే వివాహ ప్రాప్తిరస్తు' అని ఆశీర్వదించాడు.

లక్ష్మి గుడిలో నుంచి బయటకొచ్చింది. అక్కడ రాత్రితోడుగా వచ్చిన రాముడు నవ్వుతూ కనిపించాడు.

లక్ష్మి సిగ్గుపడింది. రాముడు నవ్వుతూ దగ్గరకొచ్చాడు.

.

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.